

పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుక తవ్వకం

కౌండిన్యలో సైఖితం

అధికారంలోకి రాగానే పచ్చనేతలు అక్రమార్జనకు తెరతీశారు. అందులో భాగంగా కౌండిన్యలో ఇసుక దోపిడీకి శ్రీకారం చుట్టారు. ఇదే అదనుగా తెలుగు తమ్ముళ్ల పేరుతో మరి కొందరు సైతం నదిలో అక్రమ తవ్వకాలను మొదలుపెట్టేశారు. జేసీబీలను పెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తోడేస్తున్నారు. వందలాది ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.



- రెచ్చిపోతున్న పచ్చనేతలు
- ఇష్టారాజ్యంగా జేసీబీలతో తవ్వకాలు
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

పలమనేరు : కాసులు పోగేసుకోవడమే లక్ష్యంగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో యథేచ్ఛగా దోచుకుంటున్నారు. కౌండిన్య నదిలో నీటి మట్టం తగ్గిన ప్రాంతాల నుంచి ఇప్పటికే వందలాదిలోడ్ల ఇసుకను తోడేశారు. ఏమాత్రం జంకుగొంకు లేకుండా పట్టపగలే జేసీబీలను పెట్టి ఇసుకను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లలో ఇష్టారాజ్యంగా తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా తమకేమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు.

ట్రాక్టరైతే రూ.3వేలు!

ఓ వైపు అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఇసుకను నామమాత్రపు సీనరీస్ చార్జీలతో అవసరమైన వారికి సరఫరా చేస్తామని చెబుతోంది. ఇలాంటి తరుణంలో ఇసుక అక్రమ రవాణా తగ్గాలి. కానీ ఇక్కడ మాత్రం అక్రమ రవాణా జోరందుకుంది. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.3వేలుగా వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. అదే లారీ ఇసుకైతే రూ.20వేల దాకా పలుకుతోంది.

నదిలో ఎటు చూసినా ఇదే తంతు...



పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల్లో 40 గ్రామాల మీదుగా కౌండిన్య నది ప్రవహిస్తోంది. మొన్నటిదాకా చెక్‌డ్యామ్‌ల వద్ద నీరుండేది. ఇప్పుడు నీరు తగ్గడంతో ఆయా గ్రామాల వద్ద ఇసుక తవ్వకాలు మొదలైయ్యాయి. ఆయా పంచాయతీలకు చెందిన పచ్చనేతలు ఇదంతా తమ సొంత జాగీరైనట్టు జేసీబీలు పెట్టి మరీ ఇసుకను తరలిస్తున్నారు. ముఖ్యంగా పెద్దపంజాణి మండలంలోని కౌండిన్య పరిసర గ్రామాలు, గంగవరంలోని క్యాటిల్‌ఫామ్ దాకా, పలమనేరు మండలంలోని మొరం, సముద్రపల్లె, కృష్ణాపురంలో పదిరోజులుగా అక్రమ రవాణా ఊపందుకుంది. పలమనేరు పట్టణానికి మంచి నీరు అందించే బోర్లు నాగమంగళం వద్ద ఉన్నాయి. అక్కడే బ్రిటీషర్ల కాలంలో నిర్మించిన డ్యామ్ సైతం ఉంది. ఇసుకాసురుల కారణంగా ఆ డ్యామ్ సైతం దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా మారింది.

క్లుప్తంగా

చెరువుల ఆక్రమణపై చర్యలకు డిమాండ్

పుంగనూరు : పట్టణ సమీపంలోని చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆక్రమణకు గురైన చెరువులను సీపీఐ నేతలు రామానాయుడు, టి.జనార్ధన్ పరిశీలించారు. జనార్ధన్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రహదారులు, చెరువులు, సుగాలిమిట్ట, ఎంబీటీ రోడ్డు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామమూర్తి, గురువయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో విజ్ఞానం



త్రైత గీతపై ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

కుప్పంరూరల్ : భగవద్గీత పఠనంతో విజ్ఞానం సముపార్జించవచ్చని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ తెలిపారు. ఆదివారం కుప్పం మండలం చీగలపల్లెలో ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రబోధానంద రచించిన పుస్తకాలను ఉచితంగా పంచిపెట్టారు. కృష్ణ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా భగవద్గీతను పఠించవచ్చని, తద్వారా శాంతి, సౌభాగ్యం, జ్ఞానం సిద్ధిస్తుందని వివరించారు. శివరామపురం కమిటీ ఆధ్వర్యంలో దాసేగౌనూరు గ్రామంలో ప్రచారం చేపట్టారు. కార్యక్రమాల్లో ప్రబోధానంద ప్రతినిధులు నాగరాజు, దేవ, వెంకటలక్ష్మి, ఇందిర, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మత్స్యకారదినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పుంగనూరు : పట్టణంలోని మత్స్యకారులు ఆదివారం మత్స్యకార దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘం నాయకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన మత్స్యకార దినోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కామేశ్వర్, దొరస్వామి, ప్రకాష్, నగేష్, శివప్రసాద్, చంద్రమోహన్, రఘు, బాబు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



శస్త్రచికిత్సలకు ఎంపికైన వారితో వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మహతి ఫౌండేషన్ వారి సహకారంతో కుప్పం పీఈఎస్ వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 76 మందికి కంటి పరీక్షలు చేసి 10 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. మహతీ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రతి నెలా ఏర్పాటు చేసే కంటి వైద్య శిబిరానికి సహకారం అందిస్తుండడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

పుంగనూరు : పట్టణంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత, డాక్టర్ గురూజీ, భగవత్ చిత్రపటాలకు పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు. ఆర్ఎస్ఎస్ నేతలు మాట్లాడుతూ చైతన్యవంతమైన హిందూ సమాజంతో దేశానికి మేలు చేకూరుతుందని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

వి.కోట : ప్రజలు తమ ఇంటి పరిసరాలను తప్పనిసరిగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీంతో రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని డీఎల్‌పీఓ లక్ష్మి తెలిపారు. ఆదివారం మండలంలోని తోటకనుమ గ్రామంలో ఆమె పర్యటించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ వారం నుంచి తోటకనుమలో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, దీంతోనే స్వాతి అనే మహిళ మృతి చెందినట్లు తెలిసిందన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టామని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్సలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవర్ధన్, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలుగా నిలిచిన జట్లతో నిర్వాహకులు

- సంయుక్త విజేతలుగా చౌడేపల్లె, పుంగనూరు జట్లు

పలమనేరు : ఏపీ గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గంగవరంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. నాలుగు రోజులుగా సాగుతున్న టోర్నీలో ఫైనల్స్‌కు చేరిన చౌడేపల్లె, పుంగనూరు జట్లు సంయుక్త విజేతలుగా నిలిచినట్లు జిల్లా సచివాలయాల సంఘం అధ్యక్షుడు మురళీనాథ్ తెలిపారు. రన్నరప్‌గా రామకుప్పం జట్టు నిలిచిందని వెల్లడించారు. అనంతరం విన్నర్స్‌కు రూ.10వేలు, రన్నర్స్‌కు రూ.5వేలు ట్రోఫీలను బహుకరించారు. మ్యాన్‌ఆఫ్ ది సిరీస్ అవార్డును చౌడేపల్లె క్రీడాకారుడు సల్మాన్ అందుకున్నాడు. కార్యక్రమంలో సాయి బంగారం, రామరాజు, రంగనాథం పాల్గొన్నారు.

13న అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ సమావేశం

పుంగనూరు : పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఈనెల 13వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. సమావేశంలో కమిటీ ఏర్పాటు, బహుజనుల ఐక్యత, సమస్యల పరిష్కారంపై ప్రణాళికలకు సూచనలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభంకానున్న ఈ సమావేశానికి సంఘం సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

వైభవంగా ముత్యాలమ్మ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రొంపిచెర్ల : రొంపిచెర్లలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం వైభవంగా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే మూలవిరాట్‌కు 101 బిందెల పసుపు నీళ్లతో అభిషేకం చేశారు. అమ్మవారిని అర్చకుడు గుణశేఖర్ ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి ముత్యాలమ్మ తల్లిని పురవీధుల్లో ఊరేగించారు.

టీడీపీ నేతల దాడి హేయం

పలమనేరు : పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలో సీపీఎం నాయకుడు రామారావుపై అక్కడి టీడీపీ నేతలు దాడి చేయడం హేయమని స్థానిక సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు, ఈశ్వర్ మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాయల సిబ్బందితో లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛను నగదు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని, అయితే టీడీపీ నేతల చేతులమీదుగా పెన్షన్లు ఇవ్వడంపై ఆయనే సమాధానం చెప్పాలని కోరారు. ఇంతటి స్వార్థపూరితమైన పాలన గతంలో ఎన్నడూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రశ్నించిన సీపీఎం నేతపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళలకు దిగుతామని హెచ్చరించారు.

‘చీటి’ంగ్!



పోలీసులను ఆశ్రయించిన బాధితులు (ఫైల్)

- భారీగా అనధికారిక చీటీల నిర్వహణ
- కమీషన్ కోసం ఏజెంట్ల కక్కుర్తి
- అధిక వడ్డీ వస్తుందని బోల్తా పడుతున్న బాధితులు
- నమ్మకంగా ఉంటూ ఐపీ పెట్టేస్తున్న నిర్వాహకులు
- గత రెండేళ్లలో రూ.50 కోట్ల వరుకు మోసాలు

పలమనేరు : అధిక వడ్డీ గిట్టుబాటవుతుందనే ఆశతో పలువురు మోసపోతున్నారు. ముక్కూముఖం తెలియని వారి వద్ద చీటీలు వేసి నష్టపోతున్నారు. అసలు ఏమాత్రం నిబంధనలు పాటించకుండా చీటీలు నిర్వహించేవారిని నమ్మి నట్టేట మునుగుతున్నారు. అత్యాశకు వెళ్లి చివరకు పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పలమనేరు ప్రాంతంలోనే గత రెండేళ్లలో దాదాపు రూ.50 కోట్లకు పైగా ప్రజలను చీటింగ్ చేశారు.

ప్రతి నెలా రూ. 10 కోట్ల వరకు..

నియోజకవర్గంలో ప్రతినెల రూ.10 కోట్ల దాకా అనధికారికంగా చీటీలు సాగుతున్నాయి. రూ.లక్ష నుంచి రూ.50 లక్షల చీటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు ఉండడం గమనార్హం.

కేవలం కమీషన్ కోసమే..

చీటీలను నిర్వహించే ఏజెంట్‌కు ఓ చీటీ ఉచితంగా ఉంటుంది. దీంతో ఆ చీటి స్థాయిని బట్టి రూ. 50 వేల నుంచి రూ.50 లక్షల దాకా ఉచితంగా వస్తుందని కక్కుర్తి పడి వీటిని నిర్వహిస్తున్నారు. ఎవరైనా చీటీ పాడి డబ్బు చెల్లించకపోతే ఆ భారం వారిపై పడుతుంది. దీంతో చీటి కట్టని వ్యక్తి నుంచి డబ్బు వసూలు చేయలేని ఏజెంట్లు చేతులెత్తేస్తున్నారు.

ఇదిగో సాక్ష్యం..

పలమనేరు మండలం మొరం గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి పక్కనే ఉన్న కన్నమాకులపల్లెలో ఓ వ్యక్తి వద్ద రూ.16లక్షల చీటీ వేశాడు. ఇందుకోసం రూ.4.60 లక్షల దాకా చెల్లించాడు. అయితే ఇదే చీటీలోని టైలర్ బుజ్జి అనే వ్యక్తి చీటీ పాడుకుని డబ్బుతో పరారయ్యాడు. ఆపై కోర్టులో ఐపీ పెట్టేశాడు. దీంతో మిగిలినవారికి చీటీ డబ్బు చెల్లించలేదు. ఫలితంగా ఇందులో చీటీలు వేసిన వారు అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గంగవరం మండలం నలసానిపల్లెకు చెందిన శంకరయ్య, జ్యోతి దంపతులు గ్రామంలో మంచి ఇల్లు కట్టి బాగా డబ్బున్నట్టు బిల్డప్ ఇచ్చారు. కొన్నాళ్ల పాటు చీటీలను పకడ్బందీగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. దీంతో చాలామంది తాము దాచుకున్న డబ్బును ఎక్కువ వడ్డీ కలిసొస్తుందని నమ్మి చీటీలేశారు. బాగా డబ్బులు జమ అయ్యాక ఆ దంపతులు ఇంటికి తాళం వేసి ఉన్న ఆస్తులను బంధువుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి దర్జాగా పారిపోయారు. దీంతో చీటీలేసిన వారు లబోదిబోమని పోలీసులను ఆశ్రయించారు. ఇదే క్రమంలో గంటావూరు కాలనీకి చెందిన అన్నపూర్ణ చీటీలు కట్టించుకొని రూ.50 లక్షలతో ఉడాయించింది. లైసెన్సులేని వారివద్ద చీటీలను కట్టి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నా జనం మాత్రం ఆశకు పోయి తిప్పలు కొని తెచ్చుకుంటున్నారు.



శంకరయ్య ఇంటి వద్ద గుమికూడిన బాధితులు (ఫైల్)

గ్రామోత్సవం



గుడుపల్లె మండలంలోని పెద్దబదివాడలో మునీశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ప్రతిమను ఏర్పాటు చేసి విశేషంగా తీర్చిదిద్దారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు ఆలయం వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఉత్సవర్లను ప్రత్యేకంగా ముస్తాబు చేసి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి గుడిని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. – గుడుపల్లె



వైఎస్సార్ జయంతికి ఘనంగా ఏర్పాట్లు



పలమనేరులోని వైఎస్సార్ విగ్రహం

పలమనేరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం నిర్వహించేందుకు పట్టణంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. స్థానిక మార్కెట్ కమిటీ, జిలానీ సర్కిళ్లలోని వైఎస్సార్ విగ్రహాల వద్ద వేడుకలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పెద్దపంజాణి మండలంలో ఇటీవల టీడీపీ నేతల వేధింపులతో మృతి చెందిన వీఆర్‌ఏ మునెప్ప ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

పెద్దసంఖ్యలో తరలిరండి : పీఎస్ నాగరాజు

వి.కోట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించనున్న వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరవుతారని వెల్లడించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

టెంకాయల దుకాణంగా బస్ షెల్టర్



బస్‌షెల్టర్‌లో వేసిన కొబ్బరికాయలు

పలమనేరు : పట్టణంలోని రంగబాబు సర్కిల్‌లో బస్సు షెల్టర్‌ను కొందరు ఆక్రమించుకుని కొబ్బరికాయల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై ఆదివారం స్థానిక మానవ హక్కుల సంస్థ నిర్వాహకుడు డీవీ మునిరత్నం మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సైతం కూల్చేశారని ఆరోపించారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పుంగనూరు : పట్టణంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సంతోపాటు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నేత నరసింహులు మాట్లాడుతూ మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాధికారం సాధిస్తామన్నారు. 30 ఏళ్ల పోరాటంలో ఎంతో మంది పేదలకు బాసటగా నిలిచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటరమణ, నాగభూషణం, విజయ్ , విశ్వనాథ్, ప్రభాకర్, నారాయణ, అమరనాథ్, బాబు, బుడ్డన్న, నరసింహులు, సురేష్ , కేశవ పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: మండలంలోని కందూరు మిట్టపల్లె దళితవాడలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. మొగిలీశ్వర్, రవి, మణికంఠ, లోకేష్, రమేష్, లక్ష్మీపతి, సురేంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె : ఎమ్మార్పీఎస్ వ్యవస్థపక దినోత్సవ వేడుకలను ఆదివారం ఏ.కొత్తకోట, పలగార్లపల్లె, తిరుమణపల్లెలో ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు నారాయణస్వామి, రెడ్డెప్ప, చంద్రప్ప, ఓబులేసు, శ్రీరాములు, రమణ, సుధాకర్, రంజిత్, నాగరాజ, ఆంజప్ప, ఆదినారాయణ, సదాశివ, తిమ్మయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన ఆస్థాన మండపంలో ఆదివారం ఓ ప్రైవేటు స్కూల్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. పిల్లలు ఈ ప్రదర్శనలో పాల్గొని అద్భుతంగా నాట్య ప్రతిభను ప్రదర్శించి ఆహుతులను అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

దాతల వితరణ నిరుపయోగం





నిరుపయోగంగా ఇనుప గేట్లు, రేకులు

చౌడేపల్లె : స్థానిక బజారువీధిలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి దాతలు వితరణగా అందించిన రేకులు, ఇనుప సామగ్రి , గేట్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. గతంలో ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం దాతలు సుమారు రూ.2 లక్షలకు పైగా విలువ చేసే ఇనుప సామగ్రిని విరాళంగా అందించారు. ఈ క్రమంలో సీసీఎఫ్ నిధులు రూ:3 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు చేసేందుకు ఆ ఇనుప సామగ్రిని తొలగించారు. ఇక అప్పటి నుంచి వాటిని ఎవరూ పట్టించుకోలేదు. వీటిని కొందరు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా దేవదాయశాఖ అధికారుల స్పందించి మూలన పడేసిన ఇనుప సామగ్రిని సద్వినియోగం చేయాలని స్థానికులు కోరుతున్నారు.